


భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం | 23 | డిసెంబర్ | 2024 ◆ పేజీలు : 7


# పెండింగ్ దరఖాస్తుల పై దృష్టి సారించాలి

## - ఎలక్ట్రోల్ అబ్జర్వర్ బాలమాయాదేవి

**కొత్తగూడెం కలెక్టరేట్, డిసెంబర్ 22 (ప్రజాజ్యోతి):**

ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ అండ్ డిస్టిక్ మెజిస్ట్రేట్ జితేష్ వి పాటిల్ తో కలిసి ఎలక్ట్రోల్ అబ్జర్వర్ బాలమాయాదేవి స్పెషల్ సమ్మరీ రివిజన్ 20 -25 పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాకు విచ్చేసిన ఎలక్ట్రోల్ అబ్జర్వర్ బాలమాయదేవి కి పూల మొక్క ఇచ్చి కలెక్టర్

మిగతా 7 లో...





# రాష్ట్రాభివృద్ధికి... వెన్నుముక సింగరేణి

### కార్మికులు, అధికారులు, సిబ్బందికి ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

**కొత్తగూడెం (సింగరేణి), డిసెంబర్ 22, ప్రజాజ్యోతి:**

సింగరేణి కాలరీస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు సింగరేణి కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బొగ్గు ఉత్ప త్తి ద్వారా రాష్ట్ర, దేశ ఇంధన అవసరాలను తీర్చడంలో సింగ రేణి సంస్థ కీలక పాత్ర పోషిస్తూ, రాష్ట్రానికి తలమానికంగా నిలుస్తోందని అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి సింగరేణి వెన్నెముకగా నిలుస్తున్న విషయాన్ని ప్రస్తావించారు. తెలంగాణలోని ఆరు జిల్లాల్లో లక్షల మంది ప్రజలకు ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా జీవనాధారంగా ఉన్న సింగరేణిని కేవ లం బొగ్గు ఉత్పత్తికే ప రిమితం చేయ కుండా ఇతర రంగాలలోకి కూడా ప్రవేశించి మరింత విస్తరించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. సింగరేణి సంస్థ సుస్థిర భ విష్య త్ కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, శ్రమశక్తిని చాటుతూ సంస్థను అగ్రగామిగా నిలిపేందుకు ప్రతి ఒక్కరూ పునరంకితమవాలని ఆయన కోరారు.



# అమ్మో... ఐటీసి

2 లో..

- సారపాకలో క్యాన్సర్ బీభత్సం...!
- పొగ మంచులతో కమ్ముకొస్తున్న కాలుష్యం
- కట్టడి చేయకుంటే ఖతమే..!
- పడకేసిన పర్యావరణ సమతుల్యం..

క్యాన్సర్ సోకినవారు ప్రాణాలతో బయటపడాలంటే ఆషామాసి విషయం కాదు. అంతటి భయానకమైన వ్యాధి బూర్గంపాడు మండల పరిధిలోని సారపాక పంచాయతీ సహా పలు పంచాయతీలో చాప కింద నీరులా నానాటికి విస్తరిస్తూనే ఉంది. అయితే బూర్గంపాడు మండల పరిధిలోని పలు గ్రామాల్లో క్యాన్సర్ సహా పలు రకాల శ్వాస కోస, గుండె సంబంధిత విష రోగాలకు కారణం కాలుష్యం అంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు.

◆ బూర్గంపహాడ్, ప్రజాజ్యోతి




# 'సింగరేడు'కు బువ్వ కరువు..!

2 లో..

- -రోజు వారి కూలీలుగా మారిన కార్మికన్న
- -పూలు అమ్మిన చోటే కట్టెలమ్ముతున్న వైనం
- -ఓపెన్ కాస్టులతో ఉపాధి సమాధి
- -కారుణ్య నియామాకాలతో కంటి తుడుపు!
- కానరాని నూతన గనులు
- -ఓసీలపైనే ఆసక్తి
- అధిక ఉత్పత్తే కారణమా!
- ఊసేలేని కొత్త నియామకాలు?
- -నేడు సింగరేణి 135వ ఆవిర్భావ దినోత్సవం

రక్తా మాంసాల స్వేదంతో... భూగర్భంలోని నల్ల బంగారాన్ని వెతికి తీసి... కోట్లాది మందికి వెలుగులు పంచుతున్న సింగ'రేడు'.... అనేక సంస్కరణల చట్రంలో నలిగిపోతున్నాడు... నాడు దర్జాగా బతికిన కార్మికన్న నేడు రోజు కూలీగా... రెక్కాడనిదే డొక్కాడని దైన స్థితికి చేరుకున్నాడు. ఓపెన్ కాస్టుల పేరుతో కార్మికుల పొట్టగొడుతున్న విధానంతో... ఇల్లందుతో పాటు సింగరేణి గనులు... చరిత్ర గర్భంలో కలిసిపోయే ప్రమాదం దాపురించింది... సింగరేణి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా 'ప్రజాజ్యోతి' ప్రత్యేక కథనం...

◆ ఇల్లందు, ప్రజాజ్యోతి




సిరులతల్లి సింగరేణికి ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు..

గౌ॥ శ్రీ N.బలరాం, IRS గారు
చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్
సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్

ONE FAMILY, ONE VISION, ONE MISSION
THE SINGARENI COLLIERIES COMPANY LIMITED
SCCL

ఒకే కుటుంబం.. ఒకే లక్ష్యం...ఒకే గమ్యం... ఈ స్పూర్తిదాయకమైన నినాదంతో మహోన్నతమైన సంస్థగా రూపాంతరం చెంది... నేడు దక్షిణ భారతదేశంలోనే సుప్రసిద్ధ ప్రభుత్వ రంగ సంస్థగా విరాజిల్లుతూ రాష్ట్ర పురోగాభివృద్ధికి పునరంకితమవుతూ 135 వసంతాలు పూర్తి చేసుకొని 136వ వసంతంలోకి అడుగుపెడుతున్న సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ యాజమాన్యానికి, కార్మికులకు, కార్మికుల కుటుంబాలకు మా హృదయపూర్వక "సింగరేణి దినోత్సవ" శుభాకాంక్షలు...

అధికారులు మరియు సిబ్బంది
సివిల్ కాంట్రాక్టర్స్, కొత్తగూడెం కార్పోరేట్

# అమ్మో 'ఐ టి సి'

**బూర్గంపహాడ్ డిసెంబర్ 22 (ప్రజా జ్యోతి):**

క్యాన్సర్ సోకినవారు ప్రాణాలతో బయటపడాలంటే ఆషామాసి విషయం కాదు.అంతటి భయానకమైన వ్యాధి బూర్గంపాడు మండల పరిధిలోని సారపాక పంచాయతీ సహా పలు పంచాయతీలో చాప కింద నీరులా నానాటికి విస్తరిస్తూనే ఉంది. అయితే బూర్గంపాడు మండల పరిధిలోని పలు గ్రామాల్లో క్యాన్సర్ సహా పలు రకాల శ్వాసకోస,గుండె సంబంధిత విష రోగాలకు కారణం కాలుష్యం అంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా ఐటీసీ పేపర్ మిల్లు నుంచి విడుదలవుతూ సారపాక పంచాయతీలో విపరీతంగా వస్తున్న దుర్వాసన వలన ప్రజలు తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సిన దుస్థితి వస్తుందని స్థానికులు పేర్కొంటున్నారు.

**- కట్టడి చేయకుంటే ఖతమే..!**

బూర్గంపాడు మండల పరిధిలోని పలు గ్రామాల్లో విస్తరిస్తున్న విష రోగాల పట్ల, ప్రజల్లో తలెత్తుతున్న అనారోగ్య సమస్యల పట్ల స్థానికులు, ప్రతినిధులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే సారపాక పంచాయతీలో క్యాన్సర్ రోగుల సంఖ్య నానాటికి పెరుగుతూ ఉందని విశ్వసనీయ సమాచారం.అది మాత్రమే కాక మహిళల్లో, పురుషుల్లో సంతాన ఉత్పత్తి సమస్యలు తలెత్తుతుండడమే కాకుండా,శ్వాస కోస సంబంధిత వ్యాధుల సైతం విచ్చలవిడిగా వ్యాప్తి చెందుతున్నాయి. కాలుష్యం వలన అంత చిక్కని రోగాలు వచ్చి ప్రజలు హరి గోసలు పడుతుంటే సంబంధిత అధికారులు కాలుష్యంపై చర్యలు తీసుకోకపోవడం ఏంటని స్థానికులు మండిపడుతున్నారు. అధికారుల దృష్టికి ఈ సమస్యలు రాలేదా..? లేక అంతా బాగానే ఉందని కొందరు మాటల మాంత్రికులు కవరింగులు చేస్తున్నారా..? ఐటీసీ అధికారులు ఇచ్చే ఆమ్యామ్యాలకు అధికారులు తెలిసి తెలియనట్లు వ్యవహరిస్తున్నారా..? తెలియని పరిస్థితులు బూర్గంపాడు మండల వ్యాప్తంగా నెలకొన్నాయి.

**- పడకేసిన పర్యావరణ సమతుల్యమా..?**

ఐటీసీ కంపెనీ 8వ మిషన్ నిర్మాణం కోసం పర్యావరణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో స్థానికంగా ఉన్న పలువురు వాట్సప్ గ్రూపుల ద్వారా, పేపర్, న్యూస్ ప్రకటనల ద్వారా ఐటిసి పేపర్ మిల్లు పరిశ్రమ ప్రారంభ సమయంలో ఇచ్చిన వాగ్దానాలను, హామీలను మరిచి కంపెనీ విస్తరణ, కంపెనీ లాభాల కోసం మాత్రమే పరుగులు పెడుతుందని తీవ్రమైన ఆరోపణలు గుర్తించారు. కొందరు సభకు హాజరై తీవ్ర విమర్శలు చేయగా మరికొందరిని ముందస్తు అరెస్టు చేయడంతో ఆ సభకు హాజరు కాలేకపోయారు. ఇప్పటికే ఐటీసీ పరిశ్రమ ద్వారా పర్యావరణ సమతుల్యం తీవ్రంగా దెబ్బతింటుందని పలువురు మేధావులు ప్రశ్నిస్తుంటే ఐటీసీ యాజమాన్యం కానీ, ఇటు సంబంధిత అధికారులు కానీ చూసి చూడనట్లు వ్యవహరించడం వెనుక ఆంతర్యం ఏమిటని స్థానికంగా చర్చలు నడుస్తున్నాయి. ఐటిసి ప్రారంభ సమయంలో ఇచ్చిన హామీల లో భాగంగా ఏర్పాటు చేస్తానన్న గ్రీన్ బెల్ట్ ఎక్కడ ఉందో చూపించాలని ఆనాటి సభలో పలువురు ప్రశ్నించిన సంగతి విధితమే. అంతేకాకుండా ఈరోజున స్థానికంగా ఉన్న ఆసుపత్రులలో ప్రజల రోగాలు, ఆరోగ్య సమస్యలు ఏ విధంగా వస్తున్నాయి. వచ్చే అవకాశాలు ఉన్నాయి అని అడిగితే డాక్టర్లు ఏం సమాధానం చెప్తారో తెలియనిది పరిస్థితి. ఇకనైనా జిల్లా స్థాయి ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు,మానవ హక్కుల సంఘాలు స్థానిక సమస్యపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించి స్థానికంగా క్యాన్సర్ తదితర రోగాలు ఏ విధంగా ప్రబలుతున్నాయి అనే విషయాన్ని బహిర్గతం చేయడంతో పాటు ప్రజల అనారోగ్యానికి కారణం అవుతున్న వాటిని కట్టడి చేయాలని స్థానికులు ముక్తకంఠంతో కోరుతున్నారు.







# "సింగరేడు"కు బువ్వ కరువు!








**ఇల్లందు, డిసెంబర్ 22, ప్రజాజ్యోతి:**

**రక్తామాంసాల స్వేదంతో...భూగర్భంలోని నల్ల బంగారాన్ని వెతికి తీసి... కోట్లాది మందికి వెలుగులు పంచుతున్న సింగ'రేడు'....అనేక సంస్కరణల చట్రంలో నలిగిపోతున్నాడు... నాడు దర్జాగా బతికిన కార్మికన్న నేడు రోజు కూలీగా... రెక్కాడనిదే డొక్కాడని దైన స్థితికి చేరుకున్నాడు.ఓపెన్ కాస్టుల పేరుతో కార్మికుల పొట్టగొడుతున్న విధానంతో...ఇల్లందుతోపాటు సింగరేణి గనులు... చరిత్ర గర్భంలో కలిసిపోయే ప్రమాదం దాపురించింది... సింగరేణి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా 'ప్రజాజ్యోతి' ప్రత్యేక కథనం......**

బ్రిటిష్ పాలనలో దేశ వ్యాప్తంగా జరిగిన సర్వేలో తొలిసారిగా బొగ్గు నిక్షేపాలను 1986లో జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా అధికారి డాక్టర్ విలియమ్ కింగ్ కనుగొన్నాడు. హైదరాబాద్ దక్కన్ కంపెనీ లిమిటెడ్ ను ఏర్పాటు చేసి బొగ్గు తవ్వకాలను ప్రారంభించారు. 1921లో వ్యాపార పెరుగుదల కోసం మద్రాసులో కంపెనీ కార్యాలయాన్ని స్థాపించారు.అప్పటివరకు దక్కన్ కంపెనీగా ఉన్న పేరును సింగరేణి కంపెనీ లిమిటెడ్ గా మార్చి హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ జిల్లాలలో సర్వే నిర్వహించి బొగ్గు నిక్షేపాలను కనుగొన్నారు. సింగరేణి సంస్థ ఆరంభంలో పని చేసే కార్మికులకు డబ్బులకు బదులు జొన్నలు, గోధుమలు, బియ్యం, పంచదార తదితర నిత్యావసర వస్తువులను పంపిణీ చేసేవారు. భూగర్భ గనులలో జరుగుతున్న నిత్య ప్రమాదాలకు భయపడి కార్మికులు పారిపోతుండగా కాపలా పెట్టి మరి పని చేయించేవారు. మృత్యుకుహ దాల్లాంటి చీకటి గుహల్లోకి వెళ్లి బొగ్గును వెలికితీసి దేశానికి వెలుగులు నింపారు. ఈ క్రమంలో సంస్కరణల ఫలితంగా సింగరేణిలో యంత్రాల జోరును పెంచుతూ కార్మికుల సంఖ్యను తగ్గిస్తూ వచ్చారు. నష్టాలు వస్తున్నాయంటూ యాజమాన్యం ఓ పథకం ప్రకారం ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తూనే మరో వైపు ఓపెన్ కాస్టుల వైపు మొగ్గు చూపింది. ఇల్లందు ఏరియాలో జేకే-1,2,3,4,5, 29 డిప్ గనులను ఒక్కొక్కటిగా మూసి వేస్తూ ఓసి-1,2లను ఏర్పాటు చేసింది. అనంతరం ఓసి-2 ను సైతం మూసివేశారు. ప్రస్తుతం సుమారుగా 600 లకు పైగా కార్మికులు జేకే-5,కెఓసిలలో పని చేస్తున్నారు. ఈ ప్రాంతంలో పని చేసే కార్మికులను క్రమశిక్షణ పేరుతో ఇతర ప్రాంతాలకు బదిలీలు చేశారు. వెరసి తట్టా,చమ్మాస్ లేని సింగరేణిని చూపించడమే లక్ష్యంగా పని చేస్తూ మరో వైపు పట్టణంలోకి దూసుకువచ్చి జేకే-5 ఓసి విస్తరణ పేరుతో ఇల్లందు పట్టణాన్ని కబళించింది. టేకులపల్లి మండలంలో కోయగూడెం ఓసి-1,2 ల ఏర్పాటుతో నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం ఇవ్వకుండానే బలవంతంగా వారి భూములను లాక్కోవడం జరిగిందనే విమర్శలు ఉన్నాయి. ఈవిధంగా నల్ల బంగారానికి పుట్టినిల్లయిన ఇల్లందు పరిసర ప్రాంతాల్లో ఓసీలను ఏర్పాటు చేసి బొగ్గు నిక్షేపాలను అతి తొందరగా తరలించుకు పోయేందుకు రంగం సిద్ధం చేయడం జరిగింది. దింతో స్థానికులు కూడు, గూడు, గుడ్డ కోల్పోయి భిక్షగాళ్లలా మారే పరిస్థితులు దాపురించాయి. కార్మికులతో నాడు కళకళలాడిన గనులు నేడు వెలవెలబోతున్నాయి. పూలు అమ్మిన చోటే కట్టెలు అమ్మిన చందంగా దర్జాగా బతికిన కార్మికులు నేడు కూలీలుగా మారి దుర్భర జీవితాన్ని గడుపుతున్నారు. దక్షిణ భారతదేశంలోనే రెండవ పెద్ద పరిశ్రమగా లక్షలాది కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్న సింగరేణిలో పనిచేసే ఉద్యోగులే కాకుండా ప్రత్యేకంగా, పరోక్షంగా ఆధారపడి జీవనం గడిపేవారు లక్షలాది మంది ఉన్నారు. భూగర్భ గనుల మూసివేత, ఓసీల ఏర్పాటుతో ఉద్యోగ ఉపాధిని కార్మికవర్గం కోల్పోతూ వస్తుంది.దీనికి తోడు ఓసీలలో కాంట్రాక్టీకరణ, ప్రైవేటీకరణ, యాంత్రీకరణ, మస్టర్ల కోత, సమ్మె హక్కు తొలగింపు తదితరాలు ఒకదాని వెంట మరొకటి వేగాన్ని పుంజుకున్నాయి. సంస్థలో లక్ష 17వేల మంది ఉన్న కార్మికులు నేడు దాదాపు 43 వేలకు తగ్గిపోయారు. ఈ సంఖ్యను మరికొంత కుదించేందుకు యాజమాన్యం పథక రచన చేస్తుంది. ఇప్పటికే సివిల్ శాఖతో పాటు భూగర్భ గనులు, వర్క్ షాప్ లను మూసివేస్తూ సివిల్ పనులను కాంట్రాక్టర్లకు అప్పగించడంతో కాంట్రాక్టు కార్మికుల సంఖ్య గణనీయంగా పెరిగిపోయింది.

**వందేళ్ళ పోరాటాలు....!**

సింగరేణిలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆది నుండి కార్మిక సంఘాలు పోరాటాలు చేస్తున్నప్పటికీ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది. కార్మికుల పక్షాన నీతి నిజాయితీగా పనిచేసిన నాటితరం నాయకులు నిర్మించిన పునాదులపై నేటితరం నాయకులు సమస్యలను విస్మరించి స్వలాభం కోసం వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. యాజమాన్యానికి తొత్తులుగా మారిన పలువురు నేతల వ్యవహార శైలి ఫలితంగా నాడు కోట్ల కొట్లడి సాధించుకున్న అనేక హక్కులు నేడు హరించాయి. కార్మికునికి ప్రాణప్రదమైన వారసత్వ ఉద్యోగాలు కోల్పోగా మరో వైపు విఆర్ఎస్, గోల్డెన్ హ్యాండ్ షేక్ పేరుతో కార్మికులను మెడ పెట్టి బయటకు గెంటి వేస్తున్నారు. విఆర్ఎస్, గోల్డెన్ హ్యాండ్ షేక్ పేరుతో దాదాపు రూ. వేలకోట్లను కార్మికులకు యాజమాన్యం ఇచ్చింది. ఈ డబ్బులతో సుమారుగా 30 భూగర్భ గనులను ఏర్పాటు చేసి లక్ష 25 వేల మంది కార్మికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే అవకాశాలు ఉన్నప్పటికీ ఆ దిశగా ప్రయత్నాలు జరగడం లేదు. సంస్థలో కార్మికులకు ఇంత అన్యాయం జరుగుతున్నా కార్మిక సంఘాల నాయకులు స్పందించకపోవడంతో యాజమాన్యం ఏకంగా కూడా డిసి ప్లేన్ లాంటి నల్ల చట్టాలను ప్రయోగించి కార్మికుల సమ్మె హక్కుతో పాటు అనేక హక్కులను హరించి వేస్తున్నది.

**భూగర్భ గనులతోనే భవిష్యత్తు....**

గోదావరి పరివాహక ప్రాంతంలో సుమారు 8775 మిలియన్ టన్నుల బొగ్గు దాదాపు 1100 మీటర్ల నుండి 1600 మీటర్ల లోతున ఉన్నట్లు కేంద్ర జియోలాజికల్ సర్వే తేటతెల్లం చేసింది. భూగర్భ గనులలో నష్టాలు వస్తున్నాయనే కుట్రపూరితంగా నెపం మోపి ఓపెన్ కాస్టులను వడివడిగా ఏర్పాటు చేస్తున్నారు. ఓసీలలో కేవలం 100 నుండి 120 మీటర్ల లోతు వరకే బొగ్గును వెలికితీసే అవకాశం ఉంది. అంటే 1600 మీటర్ల లోతున ఉన్న బొగ్గులో కేవలం 10 శాతమే తీస్తుండగా మిగిలిన 90 శాతం బొగ్గు భూమిలోనే సమాధి కానుంది. 8775 మిలియన్ టన్నుల బొగ్గులో 135 సంవత్సరాల సింగరేణి చరిత్రలో ఇప్పటివరకు దాదాపు 1500 మిలియన్ టన్నుల బొగ్గు మాత్రమే తీయడం గమనార్హం. సింగరేణి యాజమాన్యం, పాలకపక్షాలు ఒక పథకం ప్రకారం తెలంగాణ ప్రాంతంలోని ఏకైక ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణి సహజ మరణానికి గురి చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన సమయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ గతంలో కోల్పోయిన వారసత్వ ఉద్యోగాలను తిరిగి పునరుద్ధరించి కార్మికుల కుటుంబాలలో వెలుగులు నింపారు.

**వారసత్వ ఉద్యోగాలు... సరే కొత్త నియామకాల సంగతి....**

గత జాతీయ సంఘాలు కార్మిక హక్కుగా ఉన్న వారసత్వ ఉద్యోగాలు పోగొట్టడం జరిగింది. వాటిని తిరిగి రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ కారుణ్య నియామకాల పేరుతో ప్రవేశపెట్టడం జరిగింది.ఇంతవరకు బాగానే ఉన్నా... సింగరేణి కార్మికుని ఆరోగ్యపరంగా సమస్య ఉంటే తిరిగి ఆ కుటుంబంలో కొడుకు,బిడ్డ,అల్లుడు,అన్న,తమ్ముడికి కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగం ఇవ్వడం జరుగుతుంది. దీనివల్ల కొత్తగా నియామకాలు జరపడం లేదనేది వాస్తవం. సింగరేణి సంస్థల్లో రాష్ట్రానికి 51 శాతం, కేంద్రానికి 49 శాతం వాటా ఉంటుంది. కానీ సింగరేణి సంస్థ ప్రైవేటీకరణకు కేంద్రప్రభుత్వం మొగ్గు చూపుతుంటే అధిక వాటా ఉన్న తెలంగాణ రాష్ట్రం ఎందుకు అడ్డుకోలేకపోతుందో అర్థం కాని పరిస్థితి.ఇలా నూతన భూగర్భ గనులు మూసివేస్తూ త్వరితగతిన అధిక ఉత్పత్తి సాధించేలా ఓపెన్ కాస్టులను తీయడంతో పాటు వాటిని సైతం ప్రైవేటీకరణ చేయడం వల్ల రానున్న రోజుల్లో సింగరేణి కార్మికులు కనిపించడం కష్టమే. ఇప్పటికైనా యాజమాన్యం, పాలక ప్రభుత్వాలు చొరవ చూపి నూతన భూగర్భ గనులు ప్రారంభించి ఓపెన్ కాస్ట్ లను పూర్తిగా రద్దు చేసి ఎంతో మంది నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు కార్మికులు అభిప్రాయపడుతున్నారు.

## సార్లు సమ్మెలో...

# గిరిజన విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకం

### ఉమ్మడి జిల్లాలో గిరిజన ఎమ్మెల్యేలు ప్రశ్నించండి

### వేడుకుంటున్న గిరిజన ఆశ్రమ పాఠశాల కాంట్రాక్టు ఉపాధ్యాయులు







కొత్తగూడెం డిసెంబర్ 22(ప్రజాజ్యోతి)

వారు డిమాండ్లను పరిష్కరించాలని రోడ్ ఎక్కారు.. వెట్టిచాకిరితో చాలీచాలని జీతంతో బతికేదుస్తున్నామని గిరిజన ఉపాధ్యాయులు గోడు గోడు విని పిస్తూ ఈనెల 16వ తేదీన సమ్మెబాట పట్టారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా సమ్మెలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన సమ్మెలో సుమారు 2100మంది కాంట్రాక్టు రెసిడెన్షియల్ ఉపాధ్యాయులు సంబంధిత గిరిజన అభివృద్ధి సంస్థ కార్యాలయం ముందు సమ్మెచేస్తూ ప్రభుత్వాన్నిడిమాండ్ చేస్తున్నారు. తామేమి గొంతెమ్మ కోరికలు కోరడం లేదని ఆదివాసి బిడ్డల భవిష్యత్తుకు పునాదులు వేస్తూ ఎంతో అంకితభావంగా పనిచేస్తూ పనికి తగ్గ వేతనం ఇవ్వాలని కోరుతున్నామన్నారు. పనిచేస్తున్న కాంట్రాక్టు గిరిజన ఉపాధ్యాయులకు ప్రతి నెల ఒకటో తేదీన రెగ్యులర్ ఉపాధ్యాయులు మాత్రమే వేతనాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉన్న 50 గిరిజన ఆశ్రమ పాఠశాలలో సుమారు 270 మంది ఉపాధ్యాయులు పని చేస్తూ తమ న్యాయమైన కోరికలను పరిష్కరించాలని తల్లి పిల్లలతో వచ్చి ఐటిడిఏ కార్యాలయం సమ్మె బాటలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. అన్ని శాఖలు న్యాయమైన సమస్యలు పరిష్కారం అవుతుండగానే తమ శాఖలో గిరిజన అధికారులే మా డిమాండ్లకు అడ్డులు పడుతూ కాలయాపన చేస్తూ మాకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు రాష్ట్రవ్యాప్తంగా సమ్మె పాట పట్టిన కాంట్రాక్టు గిరిజన ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడానికి ఆయా జిల్లాలో ఎలుక కాబడిన గిరిజన ఎమ్మెల్యేలు కూడా ప్రశ్నించకపోవడం ఎంతో బాధాకరమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న టిఆర్ఎస్ పార్టీ గిరిజన సంక్షేమాన్ని విస్మరించిందని కాంగ్రెస్ పాలల్లోనే గిరిజనులకు సరైన నిర్ణయం జరుగుతుందని ఆశపడి అధికారులకు తీసుకొచ్చిన కాంగ్రెస్ పార్టీ కూడా తమపై కపట ప్రేమ చూపుతోందని ఆరోపిస్తున్నారు. ఎంతో వ్యయ ప్రయాసాల కోర్చి ఉద్యోగరీత్య దూర భారమైనప్పటికీ అనేక ఇబ్బందులు పడుతూ గిరిజన విద్యార్థుల భవిష్యత్తు కోసం శ్రమిస్తున్నామని అయినప్పటికీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని మొర పెట్టుకుంటున్నారు. ఒకపక్క పదో తరగతి పరీక్షలు ప్రారంభం అవుతున్న తరుణంలో విద్యార్థులకు చదివితే ఉపాధ్యాయులు సమ్మెపాట పెట్టి రోడ్డు ఎక్కటం ఆ విద్యార్థుల భవిష్యత్తుకు అందకారంగా నిలుస్తుందని విద్యార్థుల తల్లిదండ్రులు సైతం ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించబడుతున్న గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు విద్యాబోధనను అందించి ఉపాధ్యాయులు సమ్మె బాట పట్టడం పరీక్షలకు ఎలా గట్టెక్కాలని విద్యార్థులు సైతం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2005 సంవత్సరంలో ఉపాధ్యాయుల కొలువులో చేరి గిరిజన విద్యార్థుల ప్రగతి బాటను వేస్తూ సమాన పనికి సమాన వేతనం లేకుండా ఉపాధ్యాయుల కుటుంబాలు దీనస్థితిలో ఉన్నప్పటికీ ప్రభుత్వం ఎందుకు దృష్టి సారించడం లేదని ప్రశ్నిస్తున్నారు. గిరిజన సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని ప్రభుత్వాలు చెప్పిన మాటలకు పొంతన లేకుండా పోతుందని గిరిజన సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని గిరిజన ఉపాధ్యాయులు చేపట్టిన సమ్మెకు సంఘీభావం తెలుపుతూ ఆయా ప్రాంతాలు ఉన్న గిరిజన ఎమ్మెల్యేలు ఇప్పటికైనా నోరు తెరవాలని తమ పక్షాన ప్రశ్నించి ప్రభుత్వాన్ని ఒప్పించాలని డిమాండ్ చేస్తున్నారు. సమ్మె పాట పట్టిన ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించక పోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనన ఉధృతం చేసి అవసరమైతే అసెంబ్లీని సైతం ముట్టడిస్తామని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని పదో తరగతి విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని త్వరితగతంగా తమ సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

## సిపిఎం జిల్లా కమిటీ లో భద్రాచలం పట్టణానికి దక్కిన ప్రాధాన్యత

### జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడిగా ఎంబి నర్సారెడ్డి





భద్రాచలం టౌన్, డిసెంబర్ 22(ప్రజాజ్యోతి )

ఉద్యమాల గడ్డయిన భద్రాచలం పట్టణానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సిపిఐఎం మహాసభలలో సముచిత స్థానం దక్కింది.డిసెంబర్ 20 21వ తేదీలలో ఇల్లందులో రెండు రోజులపాటు జరిగిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సిపిఐ ఎం మూడో మహాసభలో అత్యంత ప్రాధాన్యత గల నూతన కమిటీ ఎన్నిక ప్రక్రియలో భద్రాచలం పట్టణానికి చెందిన ఎం. బి నర్సారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులుగా,పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, జిల్లా కమిటీ సభ్యులుగా పార్టీ మాజీ పంచాయతీ ఫ్లోర్ లీడర్ బండారు శరత్ బాబు, జిల్లా కమిటీ సభ్యులుగా సున్నం గంగా జిల్లా కమిటీ సభ్యురాలిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమర వీరుల త్యాగ ఫలితంగా భద్రాచలం డివిజన్ ఉద్యమం నిర్మితమైందని అన్నారు. రెండు రోజులపాటు జరిగిన జిల్లా మహాసభలలో నూతనంగా ఏర్పడ్డ జిల్లా కమిటీ లోకి భద్రాచలం పట్టణ ఉద్యమ చరిత్ర నేపథ్యంలో దక్కిన ఈ సముచిత స్థానానికి తగినట్టుగానే ఉద్యమాలు నిర్మించి పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. భద్రాచలం పట్టణంలో నెలకొన్న సమస్యలపై అధ్యయనం చేసి పోరాటాలను రూపొందించుకొని పార్టీకి పూర్వక తీసుకువచ్చేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఇల్లందు పట్టణంలో జరిగిన రెండు రోజుల మహాసభలో భద్రాచలం ఆనుకుని ఉన్న ఐదు పంచాయతీలను తిరిగి భద్రాచలంలో కలపాలని తీర్మానం చేశామని, అదేవిధంగా పట్టణాన్ని ముప్పు నుండి కాపాడేందుకు కరకట్ట పునర్మించాలన్న మరో తీర్మానానికి ప్రతినిధులు ఆమోదం పలికారని తెలిపారు. ఈ తీర్మానాల అమలు కోసం దశ వారి పోరాటాలకు పార్టీ ప్రణాళికను రూపొందిస్తుందని అన్నారు. సిపిఎం జిల్లా కమిటీలు భద్రాచలానికి దక్కిన సముచిత స్థానానికి అభ్యుదయ భావాదులు వామ పక్షవాదులు పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఘనంగా జాతీయ గణిత దినోత్సవం

భద్రాచలం టౌన్, డిసెంబర్ 22(ప్రజాజ్యోతి )

గణిత పితామహుడు శ్రీనివాస రామానుజం జయంతి సందర్భంగా ఆదివారం భద్రాచలం కెసిఆర్ కాలనీలో గల టీ డబ్ల్యూ ఆశ్రమ బాలుర హై స్కూల్ లో ఘనంగా నిర్వహించారు. ముందుగా గణిత పితామహుడు శ్రీనివాస రామానుజం చిత్ర పటానికి ప్రధానోపాధ్యాయులు టి. నరేంద్ర, వార్డెన్ గుగులోత్ మోహన్ పుల్లదండాలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూగణిత శాస్త్రం లో ఏనాటికీ చెక్కు చెదరని ధృవతార శ్రీనివాస రామానుజం అని , అనంతాన్ని తెలుసుకున్న అసాధారణ మేధావి అని , అంకెల మాంత్రికుడు, అంకెలనే ఆయుధాన్ని ఉపయోగించి గణితం తో యుద్ధం చేసిన గణిత శాస్త్ర యుద్ధవీరుడు, భరతమాత గర్వించదగ్గ గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ అని విద్యార్థులకు తెలియజేశారు . గణితానికి ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా ఈరోజు భారత ప్రభుత్వం గణిత శాస్త్ర దినోత్సవం జరుపుకుంటుందని అన్నారు. ఈ సందర్భంగా గణిత శాస్త్ర అభిమానులకు,ఉపాధ్యాయులకు,విద్యార్థులకు గణిత దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఘనంగా గడ్డం వెంకటస్వామి వర్ధంతి వేడుకలు



ఇల్లందు, డిసెంబర్ 22, ప్రజాజ్యోతి:

సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియాలోని జియం కార్యాలయంలో ఆదివారం గడ్డం వెంకటస్వామి వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గడ్డం వెంకటస్వామి చిత్రపటానికి ఏరియా జియం వీసం కృష్ణయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటస్వామి చురుకైన ట్రేడ్ యూనియన్ వాదని, 1961 నుండి 1964 వరకు ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ కు నాయకత్వం వహించారన్నారు. వెంకటస్వామి ఆ కాలంలోనే బిఆర్ అంబేద్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీని పబ్లిక్ ఎడ్యుకేషన్ సొసైటీ గా మార్చారని, నేషనల్ హట్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శిగా సుమారు 75 వేల గుడిసె వాసులకు వసతి కల్పించారని పేర్కొన్నారు. తద్వారా వారిని గుడిసెల వెంకటస్వామి అని బిరుదును సంపాదించారని తెలిపారు. అదేవిధంగా వెంకటస్వామి కేంద్ర మంత్రిగా, కార్మిక, పునరావాస శాఖ డిప్యూటీ మంత్రిగా, జౌళి, కార్మిక శాఖ మంత్రిగా పనిచేశారన్నారు. తొలి దశ తెలంగాణ ఉద్యమంలో ముఖ్య పాత్ర పోషించారని, సింగరేణికి కార్మిక శాఖ మంత్రిగా ఉన్నప్పుడు సింగరేణి ఉద్యోగులకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడానికి చాలా కృషి చేశారులని కొనియాడారు. పెన్షన్ స్కీం అమలు చేయడం చేయడానికి కృషి చేశారని, 2004 సంవత్సరంలో సింగరేణి బిఐఎఫ్ఆర్ నుండి బయటికి తీసుకురావడానికి సంస్థకు ఉన్న అప్పులను రద్దు చేయడానికి కృషి చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జియం బొల్లం వెంకటేశ్వర్లు, ఎజియం (ఐఇ) గిరిధర్ రావు, డీజియం (పర్సనల్) జీవీ. మోహన్ రావు, ఏరియా ఇంజనీర్ నరసింహరాజు, డిజియం (సివిల్) రవి కుమార్, ఎన్విరాన్మెంట్ అధికారి ధనుంజయ రెడ్డి, గుర్తింపు సంఘ పిట్ కార్యదర్శి లచ్చిరాం, ప్రతినిధ్య సంఘ ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉద్యోగుల ఎంపిక









ఇల్లందు, డిసెంబర్ 22, ప్రజాజ్యోతి:

సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియా నుండి అత్యుత్తమ ప్రతిభ కనపరచిన ఉత్తమ ఉద్యోగులను ఆదివారం వీసం కృష్ణయ్య ఎంపిక చేశారు. ఉత్తమ అధికారిగా పర్సనల్ అధికారి సాయి స్వరూప్, జెకె ఓపెన్ కాస్ట్ నుంచి డిప్యూటీ మేనేజర్ వి. కిషన్, ఫిట్టర్ జి. సత్యరాజు, కోయగూడెం ఓపెన్ కాస్ట్ నుండి జనరల్ మజ్దూర్ కనకరాజు లను ఎంపిక చేసినట్టు తెలిపారు. అదేవిధంగా ఉత్తమ గృహాలంకరణ విజేతలు ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ అంజిరెడ్డి, కరుణ శంకర్, సల్మాన్ విజయ రాజ్, శ్రీనివాసరెడ్డి, వెల్ బేబీ షో విజేతలు బేబీ కింగ్ యల్. అమన్ సాయి, బేబీ క్వీన్ యాన్ సామాన్య, ప్రిన్స్–2 కే.శ్రీయన్ష్, ప్రిన్సెస్–1 పి.నందిశ, ప్రిన్సెస్–2 కే.మాన్విత లు విజయం సాధించినట్లు పేర్కొన్నారు. వీరిని సింగరేణి దినోత్సవం రోజు సన్మానించడం జరుగుతుందన్నారు. ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైన వారిని కెఓసి ప్రాజెక్ట్ అధికారి, గోవిందా రావు, జెకె ఓసి ప్రాజెక్ట్ అధికారి ఎ. కృష్ణమోహన్, గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరీ నజీర్ అహ్మద్, ప్రాతినిధ్య సంఘం ఉపాధ్యక్షుడు జె.వెంకటేశ్వర్లు లు శుభాకాంక్షలు తెలిపారు.

## ఘనంగా పి. వి రావు వర్ధంతి



భద్రాచలం టౌన్, డిసెంబర్ 22(ప్రజజ్యోతి )

మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షులు స్వర్గీయ పివి రావు 19వ వర్ధంతి ఆదివారం భద్రాచలం భూపతి రావు కాలనీ నందు మాల మహానాడు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలేసి నివాళుల అర్పించారు. ఈ సందర్భంగా మాల మహానాడు భద్రాద్రి, కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు దాసరి శేఖర్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లొ అప్పుడున్నటువంటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కావాలనే స్వర్గీయ పివి రావు మీద కక్ష సాధింపు చర్యలకు పాల్పడ్డాడని, పివి రావు ఐ ఎ యస్ క్యాడర్ కూడా లెక్క చేయకుండా మాలల హక్కుల కోసం ఎంతో కష్టపడి సుప్రీంకోర్టులో వేసిన వర్గీకరణ కేసు 2004లో కొట్టేయించిన ఘనత పివి రావు దక్కిందని అన్నారు. నారా చంద్రబాబు లాంటి దుర్మార్గుడు ఈ దేశంలో ఉండకూడదని దళితుల మధ్య ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే ప్రయత్నాలు చేస్తాడని, చంద్రబాబు నాయుడుకి రాజకీయ భవిష్యత్తు లేకుండా మాలలు చేస్తారని పివి రావు వర్ధంతి, జయంతి కార్యకమాలు అన్ని రాష్ట్రాల్లో జరుపుకుంటామని ఈ సందర్భంగా దాసరి శేఖర్ అన్నారు. ఈ కార్యక్రమంలో సుమన్, గంగారావు, రమేష్ ఝూన్సీ, సరూప, సంకీర్తన గంగమ్మ శ్రీను, కందుల పాపయ్య, చిట్టి బాబు, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనులకు 10 శాతం రిజర్వేశన్ పెంచాలి

**జిఒ నెంబర్ 3ని కొనసాగించాలి**

**సేవాలాల్ బంజారా సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కుర్ర మోతిలాల్ నాయక్**



లక్ష్మిదేవిపల్లి డిసెంబర్22 (ప్రజాజ్యోతి ):

సుందరయ్య విజ్ఞాన కేంద్రం బాగ్ లింగంపల్లి హైదరాబాద్ ఆదివారం సేవాలాల్ బంజారా సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కొర్ర మోతిలాల్ నాయక్ నియమక పత్రం అందజేయడం జరిగింది.ఈ సమావేశంలో సేవాలాల్ బంజారా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా లావుడియా ప్రసాద్ నాయక్ నూతన గా ఎన్నుకోవడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సేవాలాల్ బంజారా సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కుర్ర మోతిలాల్ నాయక్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నియామక పత్రం అందజేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసాద్ నాయక్ మాట్లాడుతూ నా మీద ఇంత పెద్ద బాధ్యత ఇచ్చినందుకు ప్రత్యేక రాష్ట్ర కమిటీ కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది. లంబాడి గిరిజన సమస్యలపై పోరాటం చేస్తానని ఏజెన్సీరియా పీస చట్టం1/70 యాక్టు అమలు చేయలని గిరిజన ప్రజల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని గిరిజలకు న్యాయం చేస్తానని హామియిచ్చారు.గిరిజన సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. గిరిజన రిజర్వేషన్ 10 శాతానికి పెంచాలని జీవో నెంబర్ 3ని పునర్దించి కొనసాగించాలి నూతనంగా ఏర్పాటైన గ్రామపంచాయతీలను రెవిన్యూ గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో శివ లాల్ బంజారా సంఘం రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు నునావత్ రాంబాబు నాయక్ ,బోడ శ్రీనివాస్ నాయక్ ధరావత్ నాగ రాజు నాయక్, దేవిలాల్ నాయక్ గణేష్ నాయక్ మంగ నాయక్ చందు నాయక్ గణేష్ నాయక్ ,నందిని , కుమార్ నాయక్ సురేష్ నాయక్ లక్ష్మణ్ నాయక్ లక్ష్మీదేవి పల్లి మండల అధ్యక్షుడు గుగులోతు శ్రీను నాయక్ రమేష్ నాయక్ హరి నాయక్ గణేష్ నాయక్ తావూరియా ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు

# సమస్యలపై స్పందించే సిపిఐకె ప్రజా మద్దతు

**ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధివైపు అడుగులు వేస్తున్నాం**

**కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు**

**కూనంనేని సమక్షంలో పాతకొత్తగూడెంకు చెందిన 60 కుటుంబాలు సిపిఐలో చేరిక**



సింగరేణి రుద్రంపూర్ డిసెంబర్ 22ప్రజాజ్యోతి:

కొత్తగూడెం నియోజకవర్గంలో ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందిస్తూ వాటి పరిస్కారానికి అనునిత్యం శ్రమిస్తున్న సిపిఐకి రోజు రోజుకి ప్రజాదరణ పెరుగుతోందని కొత్తగూడెం శాసనసభ సభ్యులు, సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. పాతకొత్తగూడెం ఏరియా 2, 3, 4వార్డులకు చెందిన 60 కుటుంబాల వారు విద్యానగర్ కాలనీలో జరిగిన కార్యక్రమంలో కూనంనేని సమక్షంలో సిపిఐలో చేరారు, వీరికి ఎర్ర కండువా కప్పి పార్టీలోని ఆహ్వానించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని, బస్తేలను అభివృద్ధి చేస్తున్నామని, ప్రజలకు కావాల్సిన మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. నియోజకవర్గ ప్రజలు ఎర్ర జెండావైపు ఆకర్షితులవుతున్నారని, దీన్ని చిరస్థాయిగా నిలుపుకుంటామన్నారు. నూతనంగా పార్టీలో చేరుతున్న నాయకులు ప్రజా క్షేత్రంలో పని చేయాలని, ప్రజల్లో మమేకమైతేనే పార్టీకి మరింత ఆదరణ పెరుగుతుందన్నారు. భవాని, నాగేంద్ర, మందా గణేష్, నరేష్ తదితరుల నేతృత్వంలో 60కుటుంబాల వారు సిపిఐలో చేరినవారిలో వున్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు దుర్గరాసి వెంకటేశ్వర్లు, నాయకులు నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, కిలారు ప్రసాద్, కొండా స్వామి, యాంద్ర మహేష్, మధు తదితరులు పాల్గొన్నారు.

# మల్టీ పర్పస్ విధానం రద్దుకై పోరాడుదాం

టేకులపల్లి, డిసెంబర్ 22, ప్రజాజ్యోతి:




టేకులపల్లి మండల తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ ఐఎఫ్టియు నిర్మాణ జనరల్ బాడీ ఆదివారం టేకులపల్లి మండల కేంద్రంలో ఈసం మహేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం సంఘం జెండాను ఐఎఫ్టియు సీనియర్ నాయకులు మూడు బిచ్చు ఎగరవేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్టియు రాష్ట్ర నాయకులు డి. ప్రసాద్ మాట్లాడుతూ గ్రామ పంచాయితీ వర్కర్స్ ను మల్టీపర్పస్ విధానంతో ఎట్టి చాకిరిచేయించుతున్నారని వారి పనికి తగ్గ వేతనం ఇవ్వడంలో కాంగ్రెస్ ప్రభుత్వం దోబూషులడుతున్నదని అన్నారు .కేటగిరీల వారీగా పనిని కేటాయించి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు .అదే విధంగా గ్రామపంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఉద్యోగ భద్రత కల్పించాలని కనీస వేతనం 26 వేల రూపాయలను చెల్లించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జట్టంగి వెంకన్న, ఐఎఫ్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి కొక్కు సారంగపాణి, జిల్లా అధ్యక్షులు టీ. నాగేశ్వరరావు, రాష్ట్ర నాయకులు గౌని నాగేశ్వరరావు, తెలంగాణ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి నారాటి వెంకటేశ్వర్లు ఐ ఎఫ్ టి యు జిల్లా నాయకులు మోతుకూరి మల్లికార్జున్ రావు, చారి, అశోక్, ఎర్రయ్య, సురేష్, జినక ప్రసాద్, తావూరియా, భూక్య లింగ, లక్ష్మయ్య, బాబు, ఈసం సంపత్, టిపిటిఎఫ్ జిల్లా నాయకులు సరికొండ నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు .

## మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిపించండి: మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్



భద్రాచలం టౌన్, డిసెంబర్ 22, (ప్రజాజ్యోతి )

భద్రాచలం పట్టణంలొ గిరిజన సంక్షేమ శాఖ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల జనరల్ బాడీ సమావేశం గిరిజన అభ్యుదయ భవనంలో ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఉమ్మడి నల్లగొండ ,వరంగల్ ,ఖమ్మం జిల్లాల ఉపాధ్యాయ శాసనమండలి జాక్టో(ఉపాధ్యాయ సంయుక్త కార్యచరణ సమితి)22 సంఘాల అభ్యర్థి శ్రీ పూల రవీందర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఉమ్మడి నల్గొండ, వరంగల్, ఖమ్మం జిల్లాల ఉపాధ్యాయ శాసనమండలి జాక్టో అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని ఉపాధ్యాయులందరూ తమ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.ఏజెన్సీ ప్రాంత విద్యావ్యవస్థలో నెలకొని ఉన్న సి ఆర్ టి ల మినిమమ్ టైమ్స్ స్కేల్ మరియు రెగ్యులరైజేషన్ ను ప్రభుత్వం వెంటనే చేపట్టాలని , గిరిజన సంక్షేమ శాఖలో ప్రధానోపాధ్యాయులకు విద్యాశాఖ మాదిరిగా ఎంఈఓ, ఏటీడీఓ పోస్టులను మంజూరు చేసి పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. గత ఎమ్మెల్సీ గా పనిచేసిన సమయంలో కేజీబీవీ పాఠశాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉపాధ్యాయులకి పది నెలలు జీతం ఇచ్చే సందర్భంలో 12 నెలల జీతాన్ని ఇప్పిచ్చానని, విద్యాశాఖలో ప్రభుత్వ, జిల్లాపరిషత్ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించడంలో ముఖ్యమంత్రిని ఒప్పించి అందరికీ పదోన్నతులు కల్పించడం జరిగిందని, విద్యాశాఖలో భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయులను అప్గ్రేడేషన్ జీవోలులో తప్పులను సరి చేయించి పద్దోన్నతులు కల్పించడంలో కీలక పాత్ర పోషించాలని, గిరిజన సంక్షేమ శాఖలో భాషా పండితులు మరియు వ్యాయమ ఉధ్యాయుల గ్రేడ్ _2 అప్గ్రేడేషన్ పై ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి ప్రాతినిత్యం చేసి ఉన్నానని అతి తొందర్లోనే సమస్యను పరిష్కరిస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర జాక్టో కో చైర్మన్ కల్లూరి జయ బాబు (ఏటిఏ రాష్ట్ర అధ్యక్షులు), రాష్ట్ర జాక్టో డిప్యూటీ సెక్రెటరీ జి రాములు (టి డబ్ల్యూ టి యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ), కారం సర్వేశ్వరరావు, టి డబ్ల్యూ టి యు జిల్లా అధ్యక్షులు కలం సత్యనారాయణ, హీరలాల్, లక్ష్మణ్, కారం గాంధీ, తదితరులు పాల్గొన్నారు.

## అంధుల జీవితాలలో కంటివెలుగులు నింపుతున్న స్వచ్ఛంద సేవాసంస్థలు

భద్రాచలం టౌన్, డిసెంబర్ 22(ప్రజాజ్యోతి )

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, మారుతీ నర్సింగ్ కాలేజ్, లయన్స్ క్లబ్ ఆఫ్ భద్రాచలం, యన్.ఆర్.ఐ. వాసవీ అసోసియేషన్, యు.యస్.ఎ. పుష్పగిరి కంటి ఆసుపత్రి, సికింద్రాబాద్ వారి సంయుక్త ఆధ్వర్యంలో డాక్టర్ యస్. యల్. కాంతారావు పర్యవేక్షణలో జిల్లా కలెక్టర్, పి.ఒ. ఐటిడిఎ గ సహకారంతో నవంబర్ 6వ తేదీన నిర్వహించిన ఉచిత నేత్ర శస్త్ర చికిత్సా శిబిరంలో పాల్గొని పుష్పగిరి ఆసుపత్రికి ఆపరేషన్ కి వెళ్తున్న రోగుల వాహనానికి ఫారెస్ట్ డెవలప్మెంట్ చైర్మన్ పొదెం వీరయ్య జెండా ఊపి వీడ్కోలు పలికారు. సుమారు 1200 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించి 650మందిని కంటి ఆపరేషన్ల కొరకు ఎంపిక చేసి 14దఫాలుగా 534 మందికి కంటి ఆపరేషన్లు విజయవంతంగా నిర్వహించి ఆదివారం 15వ బ్యాచ్ 41 మందిని ఆపరేషన్లకు పంపించారు. గిరిజన ప్రాంతమైన భద్రాచలంలో ఇంత గొప్ప సేవలందిస్తున్న వివిద స్వచ్ఛంద సేవాసంస్థలకు ఈ కార్యక్రమానికి నేతృత్వం వహిస్తున్న డా.యస్.యల్. కాంతారావుని అభినందిస్తూ 1000మందికి కంటి ఆపరేషన్లు నిర్వహించాలని కోరారు. భవిష్యత్లో స్వచ్ఛంద సంస్థలు నిర్వహించే ప్రజాహిత కార్యక్రమాల్లో తమవంతు సహకారమందిస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమం లొ క పొదెం వీరయ్య, డా.యస్.యల్.కాంతారావు, చారుగుళ్ళ శ్రీనివాస్, యేగి సూర్యనారాయణ, బండారు క్రిష్ణయ్య, ఆఫ్తాల్మిక్ ఆఫీసర్ సంజీవరావు, కురిచేటి శ్రీనివాస్, నల్లపు దుర్గాప్రసాద్, వాసిరెడ్డి సాంబశివరావు, బానోత్ రవికుమార్, కె. వరుణ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ప్రదీప్, రాంమోహన రావు, రమేష్, మారుతీ నర్సింగ్ కళాశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

# ఘనంగా సారపాక లంబాడీల బంజారా సమ్మేళనం

*బూర్గంపహాడ్ డిసెంబర్ 22 ప్రజాజ్యోతి*



బూర్గంపహాడ్ మండల పరిధిలోని సారపాక లో గల రాజు తండా,గాంధీ నగర్, భాస్కర్ నగర్, శ్రీరాంపురం, మసీదు రోడ్,బసప్ప క్యాంపు పలు కాలనీలలో నివసించే సుమారు 4000 మంది లంబాడీ ప్రజలు ఏకమై ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ముందుగా గాంధీ నగర్ లోని సేవాలాల్ మందిరం నుండి పూజా కార్యక్రమం నిర్వహించి భాస్కర్ నగర్ నుండి ముత్యాలమ్మ పేట వరకు భారీ సంఖ్యలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు.అనంతరం సారపాక లోని పుష్కర వనం దగ్గరలో ఉన్న సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద భారీ ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన రాష్ట్ర టీచర్స్ అధ్యక్షులు లక్ష్మణ్ నాయక్,సారపాక మాజీ సర్పంచ్ ధరావత్ చందు నాయక్,సేవాలాల్ సేన నాయకులు,అజ్మీర వెంకన్న ఓర్సుల బద్రుకు ఘన స్వాగతం పలికారు. ఈ నేపథ్యంలో అజ్మీర రాంజీ అధ్యక్షతన సమావేశం నిర్వహించగా కార్యక్రమంలో లంబాడి కమ్యూనిటీకి చెందిన ఆటపాటలతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం లక్ష్మణ్ నాయక్ మాట్లాడుతూ లంబాడి జాతి 850 సంవత్సరాల గొప్ప చరిత్ర కలిగినదని తెలిపారు.సారపాక గ్రామంలో గత 30 సంవత్సరాలు సర్పంచ్ గా కొనసాగిన ధరావత్ రాజు తదనంతరం తన కుమారుడు ధరావత్ చందు నాయక్ సేవలు మరువలేనివని కొనియాడారు.రాబోయే రోజుల్లో లంబాడి జాతి మొత్తం కలిసిమెలిసి ఉండి స్థానికులను గెలిపించుకోవాలని అన్నారు. అనంతరం మాజీ సర్పంచ్ ధరావత్ చందు నాయక్ మాట్లాడుతూ సారపాక గ్రామం కుగ్రామంగా మొదలై అంచెలంచెలుగా ఎదుగుతూ ధరావత్ రాజు సారథ్యంలో కులాలకు మతాలకు అతీతంగా తన సేవలను అందించారని తెలిపారు. అంతేకాకుండా సారపాక గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పరిచే దిశగా 10 సంవత్సరాలు తనను సర్పంచ్ గా ఎన్నుకొని లంబాడి కమ్యూనిటీ యొక్క సత్తా చాటారని పేర్కొన్నారు. సారపాక ప్రజలు లంబాడీల పట్ల సహృదయంతో ఉన్నారని అన్ని కులాల వారిని ఏకపరుస్తూ గ్రామాభివృద్ధి కి తోడ్పడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అజ్మీరా రాంజీ, కిషన్,భూక్య నంద్య, బద్రునాయక్, జగన్,ముఖ్య కార్యకర్తలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా ధనుర్మాస వ్రత మహోత్సవాలు

*భద్రాచలం టౌన్, డిసెంబర్ 22(ప్రజాజ్యోతి )*



భద్రాచల పట్టణం రాజవీధిలోనిగల శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్ స్వామి వారి మఠంలో ధనుర్మాస వ్రత మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి.డిసెంబర్ 16వ తేదీన మొదలైన ఈ ఉత్సవాలు 2025 జనవరి 13 వరకూ కొనసాగుతున్నయి.ప్రతిరోజూ ఉదయం 08:30 గంటల నుండీ 10:00 గంటల వరకూ దాదాపూ యాభైమంది ఆండాళ్ తల్లి గోదాదేవి రచించిన తిరుప్పావై పాశురాలను భక్తి శ్రద్ధలతో పఠించి తల్లి గోదాదేవి ఆశీస్సులను పొంది తరిస్తున్నారు. మఠంలో మొదటి అంతస్తులో వున్న రంగనాథస్వామివారి ఆలయ ప్రాంగణంలో ఈ ఉత్సవాలు జరుగుతున్నాయి.ఆదివారం వేద పండితులైన స్థానాచార్యులు శ్రీ స్థల సాయి వారు అద్భుతమైన ప్రసంగాన్ని అందించారు. ధనుర్మాస విశిష్టతను, తిరుప్పావైలోని 7వ పాశురం యొక్క ప్రాముఖ్యతను అర్థవంతంగా విశ్లేషిస్తూ భక్తజనులకు వివరించి చెప్పారు.హేమంత ఋతువులోని మొదటి మాసమైన మార్గశిర మాసంలో ఆచరించే ఈ వ్రతం మొదట పార్వతీదేవి అమ్మవారు, తరువాత గోపికలు, ఆ తరువాత గోదాదేవి ఆండాల్ తల్లి ఆచరించి తరించారని ఆ క్రమంలో మనం కూడా యథాశక్తి పాశురాల సారాంశాన్ని గ్రహించి, తిరుప్పావై పఠించి ఆధ్యాత్మికతను, భక్తిని తద్వారా మన ధర్మాన్ని పరిరక్షించుకోవాలని బోధించారు.పండితులైన స్థానాచార్యుల వారు ఈ వ్రత మహాత్యాన్ని, ప్రాధాన్యతను అద్భుతమైన రీతిలో అర్థవంతంగా విశదీకరించడంతో భక్త జనులు పారవశ్యంలో మినిగి తరించారు.చలికి ముడుచుకుని పడుకున్న గోపికను పక్షుల కువకువలతో తెల్లవారిందని, చల్ల చిలికే స్త్రీల కరకంకిణుల ధ్వనులు వినిపిస్తున్నాయని చిన్ని కృష్ణుని సేవించుటకు వేళయిందని గోదాదేవి ఆండాల్ అమ్మవారు పిలవడమే ఈ 7 వ పాశురం యొక్క సారాంశము.అనంతరం అర్చక స్వాములు పొడిచేటి సీతారామానుజాచార్యులు, రఘుపుంగవాచార్యులు, బాలక అర్చక స్వాములు వరుణ్,వినయ్,అభిరాం లు తిరుప్పావై పాశురాలను రాగయుక్తంగా పాడి వినిపించారు.భక్తులందరికీ తీర్థ ప్రసాదాలను అందించారు.దక్షిణ అయోధ్యగా పేరు పొందిన భద్రాచలంలో, శ్రీ రామదాసుల వారు ప్రతిష్టించిన సీతారామచంద్రుల వారి కరుణా కటాక్షాలతో,చిన్నజీయర్ స్వామి వారి శుభాశీస్సులతో ఇటువంటి కార్యక్రమాల ద్వారా భక్తిని, ముక్తిని, ఆధ్యాత్మికతను జనుల్లో పెంపొందించడమే తమ లక్ష్యమని తద్వారా సంస్కృతి సాంప్రదాయాలను విస్తృత పరచడం తమ ఆశయమని మఠం నిర్వాహకులు తెలియజేసారు.ఈ కార్యకమానికి అతిథులుగా పట్టణ ప్రముఖులైన పొడిచేటి ప్రహ్లాదాచార్యులు , సత్యనారాయణ శాస్త్రి , అల్లం నాగేశ్వరరావు దంపతులు విచ్చేసి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని జి. వెంకటాచారి, పి. కమల రాజశేఖర్ గారు, ఎన్.సి.హెచ్. చక్రవర్తి , వనజారామం , రఘుపుంగవాచార్యులు , చిట్టే లలిత , ఆళ్ళ నాగేశ్వరరావు , డా. జయభారతి , తాళ్ళపూడి రాము , చారుగుళ్ళ శ్రీనివాస్ , రంగారెడ్డి తదితరులు ప్రజ్ఞా వికాస్, యువ వికాస్, ఆరోగ్య వికాస్, సంస్కార వికాస్ అనే సేవా విభాగాలతో మఠం కేంద్రంగా సేవా కార్యక్రమాలను పరిసర ప్రాంతాల్లో విస్తరింప చేస్తున్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా గణిత దినోత్సవం

*పాల్వంచ, డిసెంబర్ 22(ప్రజా జ్యోతి ):*

శ్రీనివాస రామానుజన్ 137వ జయంతిని జాతీయ గణిత దినోత్సవం గా ప్రభుత్వ డిగ్రీ కళాశాల పాల్వంచలో ఘనంగా నిర్వహించారు,ఈ సందర్భంగా ఆన్ లైన్ క్విజ్ తో పాటు, వ్యాసరూప,ఉపన్యాస పోటీలను కళాశాలలో నిర్వహించి విద్యార్థులకు ప్రథమ,ద్వితీయ,తృతీయ బహుమతులను ప్రధానం చేశారు,ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ పి పద్మ మాట్లాడుతూ శ్రీనివాస రామానుజన్ 20వ శతాబ్దంలో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన గొప్ప గణిత మేధావులలో ఒకరని శుద్ధ గణితం,గణిత విశ్లేషణ, సంఖ్య శాస్త్రం, అనంత శ్రేణులు,అవిరామ భిన్నాలు, రామానుజన్ కాన్ స్టెంట్,మాక్ తీటా ఫంక్షన్స్,రామానుజన్ కన్ జెక్చర్,రామానుజన్ ప్రైమ్,రామానుజన్ తీటా ఫంక్షన్,రామానుజన్స్ సమ్, రామానుజన్ ఐడెంటిటీస్, రామానుజన్స్ మాస్టర్ థీరమ్ లాంటి గణిత శాస్త్ర విభాగాలలో పరిశోధనల పరంగా విశేషమైన కృషిచేసిన గొప్ప గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ అని కొనియాడారు,కళాశాల గణిత అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రొఫెసర్ పొట్లపువ్వు శ్రీనివాసరావు మాట్లాడుతూ 1914 మార్చి 17న రామానుజన్ ఇంగ్లాండుకు వెళ్లి కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో పనిచేసే జి హెచ్ హార్డీ అనే గణిత శాస్త్రవేత్త ను కలుసుకొని, అక్కడ అతనికి ఆరోగ్యం సహకరించకపోయినా,అతి తక్కువ సమయంలోనే చాలా కృషి చేసి 32 పరిశోధన పత్రాలు సమర్పించి,ప్రపంచ గణిత చరిత్రలోనే తనదైన ముద్రను వేసి,చాలా తక్కువ సమయంలోనే రాయల్ సొసైటీ ఫెలోషిప్ కు ఎంపికైన మహా మేధావి శ్రీనివాస రామానుజన్ అని కొనియాడారు,రామానుజన్ జీవించింది కొద్దికాలమే అయినా సుమారు 3900 పరిశోధన ఫలితాలను రాబట్టాడని ఇవన్నీ అతని కులదైవం నామగిరి ప్రసాదించినదేనని ఆయన బలంగా విశ్వసించే వారని కళాశాల అసిస్టెంట్ గణిత ప్రొఫెసర్ పొట్లపువ్వు శ్రీనివాసరావు కొనియాడారు, 1962వ సంవత్సరంలో భారత ప్రభుత్వం శ్రీనివాస రామానుజన్ 75వ జన్మదినం సందర్భంగా సంఖ్యా శాస్త్రంలో ఆయన చేసిన విశేష కృషిని కొనియాడుతూ స్మారక తపాళా బిళ్ళను విడుదల చేసిందని మరియు 2012లో అప్పటి భారత ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ శ్రీనివాస రామానుజన్ 125వ జయంతి సందర్భంగా,2012 సంవత్సరాన్ని భారత ప్రభుత్వం జాతీయ గణిత దినోత్సవం గా ప్రకటించిందని, అప్పటినుండి ప్రతి సంవత్సరం డిశంబర్ 22న శ్రీనివాస రామానుజన్ జయంతిని భారత జాతీయ గణిత దినోత్సవం గా జరుపుకుంటున్నామని ఆయన తెలిపారు. కళాశాలలో జరిగిన గణిత దినోత్సవం లో ఈ కార్యక్రమంలో టీచింగ్ స్టాఫ్ పారేల్లి శ్రీనివాస్,కోటగిరి రాంబాబు,దివ్య,వేణు,రామ్ దాసు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



# ముక్కోటి ఉత్సవాలకు రండి

**– జిల్లా కలెక్టర్ కు ఈవో ఆహ్వానం**



*కొత్తగూడెం కలెక్టరేట్, డిసెంబర్ 22 (ప్రజాజ్యోతి ):*

జనవరి 9,10 తేదీల్లో జరిగే ముక్కోటి ఏకాదశి ఉత్సవాలకు ప్రత్యేక అతిథిగా హాజరుకావాలని భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఈవో రమాదేవి ఆదివారం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ను ఐడీఓసీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రిక అందించారు. ఈ సందర్భంగా శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ అర్చకులు జిల్లా కలెక్టర్ కు ఆహ్వాన పత్రిక అందించి ఆశీర్వచనాలు అందించారు. అనంతరం జిల్లా కలెక్టర్ భద్రాచలం ఆలయ ఈవోను ముక్కోటి ఉత్సవాల సందర్భంగా చేస్తున్న ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా భద్రాచలం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని వసతులు కల్పించాలని సూచించారు. భక్తులకు తాగునీరు, వసతి, వైద్య, భద్రత సదుపాయాలు వంటివి అందుబాటులో ఉంచాలని చెప్పారు. ముక్కోటి వేడుకల ఏర్పాట్లు భక్తులు మెచ్చేలా ఉండాలన్నారు. వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించాలని సూచించారు.

# విద్య నేర్పిన గురువును, జీవితాంతం గుర్తుంచుకోవాలి




*పాల్వంచ, డిసెంబర్ 22(ప్రజా జ్యోతి ):*

సమాజంలో ఉన్నత స్థానానికి ఎదిగేలా చేసిన,విద్య నేర్పిన గురువును,విద్యనభ్యసించిన విద్యాలయాన్ని జీవితాంతం గుర్తుంచుకోవాలని రాష్ట్ర మార్కెఫెడ్ డైరెక్టర్,డిసిఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు,పాల్వంచ ప్రభుత్వ జూనియర్ కళాశాల గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు, పాల్వంచ మండలం లక్ష్మీదేవిపల్లి గ్రామా పరిధిలోని జూనియర్ కళాశాలలో ఆదివారం జరిగిన గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలలో కొత్వాల అతిథిగా పాల్గొని ప్రసంగించారు,ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ గత 50 సంవత్సరాలుగా ఏంటో మంది విద్యార్థులను మేధావులుగా తీర్చిదిద్దిన ఘనత పాల్వంచ కళాశాలకే దక్కిందన్నారు.విద్య నేర్పిన గురువును దైవంలా చూడాలని కొత్వాల అన్నారు. జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ పసుపులేటి శంకర్,ఎంఆర్ఓ వివేక్, డైయివో వెంకటేశ్వరరావు,జిల్లా ప్రణాళికాధికారి సంజీవరావు, మాజీ జడ్పీటీసీ సభ్యులు ఎర్రంశెట్టి ముత్తయ్య,జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ జి.యుగంధర్ రెడ్డి,ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు,పలువురు రిటైర్డ్ ఉపాధ్యాయులు,పూర్వ విద్యార్థులు,విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# భద్రాద్రి రామయ్యకు నిత్యకల్యాణం

*భద్రాచలం, డిసెంబర్ 22 (ప్రజాజ్యోతి ):*



భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో సీతారాముల నిత్యకల్యాణం బుధవారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతం పలికి, ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్యబలిహరణం తదితర పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నిత్యకల్యాణంలో పాల్గొన్న జంటలకు స్వామివారి ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు.

# ఏళ్ళు గడుస్తున్నా....
# మారని సీఆర్టీల బతుకులు





**-వేతనాలు అందక సీఆర్టీలకు తప్పని తిప్పలు**

**-ప్రసూతి సెలవులు కరువు**

**-పాలకులు మారినా.. మారని ఉపాధ్యాయుల పరిస్థితి**

**-భద్రాచలం ఐటిడిఏ పరిధిలో 278 సీఆర్టీలు**

*భద్రాచలం ,డిసెంబర్ 22(ప్రజాజ్యోతి ):*

'గురు బ్రహ్మ గురు విష్ణు, గురు దేవో మహేశ్వర, గురు సాక్షాత్ పరబ్రహ్మ, తస్మైశ్రీ గురవే నమః అంటూ గురువులను దైవంగా భావిస్తాం. అలాగే, అమ్మ అడుగులు వేయడం నేర్పిస్తే.. నాన్న నడక నేర్పిస్తారు. గురువు జ్ఞానం బోధిస్తారు. మరి అలాంటి గురువులను ప్రభుత్వాలు సమస్యలోకి నెట్టి వేస్తున్నాయి. పాలకులు మారినా.. ఉపాధ్యాయుల బతుకులు మారడం లేదంటున్నారు. ఫలితంగా ఐటీడీఏ ఆధ్వర్యంలోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న కాంట్రాక్టు రెసిడెన్సి టీచర్లు (సీఆర్టీ) తమ సమస్యల పరిష్కారం కోసం ఆందోళనలకు శ్రీకారం చుట్టారు.

### మెరుగైన విద్యా బోధన కోసం...

భద్రాచలం ఐటిడిఏ పరిధిలో గిరిజన ప్రాంతాల విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన అందించడానికి ప్రభుత్వం గత పది ఏళ్ళ క్రితం గిరిజన సంక్షేమ అశ్రమ ఉన్నత పాఠశాలలలో ప్రాథమిక పాఠశాలలు ఏర్పాటు చేసి కొన్ని వేల మంది విద్యార్థులకు విద్య బోధన సౌ కర్యం కల్పిస్తోంది. వేల మంది విద్యార్థులకు పాఠాలు బోధించడానికి ఉపాధ్యాయులను ప్రభుత్వాలు నియమించాల్సి ఉన్నప్ప టికీ, కాలం గడిపేస్తుండడంతో తాత్కాలిక ఉపాధ్యాయులుగా కాంట్రాక్ట్ రెసిడెన్సి టీచర్లను 270 కి పైగా పైగా నియమించి కాలం నెట్టుకొస్తున్నారు. ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీ చేయడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తూ సీఆర్డీల ద్వారా విద్యబోధ. న కొనసాగిస్తున్నారు. 66 ఆశ్రమ పాఠశాలలో సీఆర్టీలు రెగ్యులర్ ఉపాధ్యాయులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నా.. వేతనాలు మాత్రం అంతంత మాత్రమే ఇస్తున్నారు.

### సీఆర్టీల పాత్ర ఎంతో ముఖ్యం...

గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి గత 20ఏళ్లుగా పని చేస్తున్న సీఆర్టీల పాత్ర ఎంతో ముఖ్యమైనది. రెండు దశాబ్దాలకు పైగా గిరిజన విద్య శాఖలో విద్య వ్యవస్థ మెరుగు పడడానికి కృషి చేస్తున్నారు. 2006కంటే ముందు పదవ తరగతిలో 10 శాతం ఉన్న ఫలితాలు. సీఆర్టీల రాకతో 95 శాతానికి పెరిగిం ది. 2016, 2023లలో సీఆర్టీలను క్రమబద్ధీకరిస్తామని అప్పటి ప్రభుత్వాలు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కూడా చేసింది. ఇప్పటి వరకు క్రమబద్ధీకరణ చేయకుండా మినిమం టైం స్కేల్ అమలు చేయకుండా , సకాలంలో వేతనాలు ఇవ్వకుండా ప్రభుత్వం కాలం గడిపేస్తూ ఉండడంతో సీఆర్టీలు ఆందోళన బాట పట్టారు.

### సకాలంలో వేతనాలు అందక...

ప్రతీనెల ఒకటో తేదీన ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు ఇస్తున్న ప్రభుత్వం. కాంట్రాక్ట్ రెసిడెన్సీ టీచర్లకు సకాలంలో వేతనాలు ఇవ్వకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందుల పాలవుతున్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రతీ నెల ఒకటో తేదీ న వేతనం ఇవ్వాలని, సీఆర్డీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రమాదాల భారనపడి ప్రాణాలు కోల్పోయిన సీఆర్టీలకు రూ. 25 లక్షల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని, ప్రావిడెంట్ ఫండ్ సౌకర్యం కల్పించాలని, 61 ఏళ్లు నిండిన సీఆర్డీలకు రూ.20 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్ ఇవ్వాలని, సీఆర్టీలు అందరికీ ఆరోగ్య కార్డులు ఇవ్వాలని సీఆర్డీలు డిమాండ్ చేస్తున్నారు.

### మహిళలకు ప్రసూతి సెలవులేవీ..?

ప్రభుత్వ విభాగాలలో పని చేస్తున్న మహిళా ఉద్యోగులతో పాటు అధికారుల స్థాయి వరకు ప్రసూతి సెలవులతో పాటు పలు రకాల బెనిపిట్స్ ఇస్తున్న ప్రభుత్వం, మహిళా సీఆర్టీలకు మాత్రం ప్రసూతి సెలవులు కూడా ఇవ్వకపోవడంతో వారు ఆర్థికంగా నష్టపోతున్నామంటున్నారు. ప్రభుత్వ విభాగంలో పని చేస్తున్న మహిళల మాదిరిగానే తాము కూడా ప్రభుత్వ పాఠశాల ల్లోనే విధులు నిర్వహిస్తున్నందున 180 రోజుల ప్రసూతి సెలవులు ఇవ్వాలని మహిళా సీఆర్టీల పిల్లల సంరక్షణ కోసం వేతనంతో కూడిన చైల్డ్ కేర్ లీవ్స్ ఇవ్వాలని పలువురు మహిళా సీఆర్టీలు కోరుతున్నారు.

### మూతపడనున్న కన్వర్టెడ్ పాఠశాలలు..!!

ఒకవైపు ఉన్నతాధికారులు పదవ తరగతిలో వంద శాతం ఫలితాలు రావాలంటూ ప్రణాళికలు అమలు చేస్తుండగా..మరోవైపు సీఆర్డీలో ఉద్యమబాట పట్టడంతో అధికారుల ప్రణాళికలకు బ్రేక్ పడేలా కనిపిస్తోంది. ఆశ్రమ పాఠశాలల్లో బోధిస్తున్న ఉపాధ్యాయుల్లో రెగ్యూలర్ వారి కంటే ఎక్కువ సీఆర్టీలే ఉన్నారు. పిజికల్ సైన్స్ గణితం, తెలుగు, సోషల్ లాంటి సబ్జెక్టులు బోధిస్తున్న ఉపాధ్యాయులు ఎంతో మంది ఉన్నారు. వీరు ఆందోళనబాట పట్టడంతో విద్యార్థుల పరిస్థితి అయోమయంలో పడింది. ఏదిఏమైనా ప్రభుత్వం సీఆర్డీల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పరిశీలకులు అంటున్నారు.

### మహిళా సీఆర్టీల సమస్యలు పరిష్కరించాలి : సకినం రమ్య ( సీఆర్టీ)

ప్రభుత్వ మహిళ సీఆర్టీల సమస్యలు పరిష్కరించాలి. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే తాము ఎనిమిది గంటల



కంటే అధికంగా శ్రమిస్తున్నాం.

### ప్రసూతి సెలవులు ఇవ్వాలి : భూక్యా విజయలక్ష్మి , సీఆర్టీ

ప్రభుత్వ మహిళ ఉద్యోగులకు ఇస్తున్న విధంగానే మహిళ సీఆర్డీలకు ప్రభుత్వం ప్రసూతి సెలవులు ప్రకటించాలి. అదే విధంగా మహిళ సీఆర్టీల పిల్లల సంరక్షణకు చైల్డ్ సెలవులు ఇవ్వాలి.

### ప్రజా ఉద్యమం నిర్వహిస్తాం : భూక్యా మంగీలాల్ , సీఆర్టీ

సీఆర్టీల సమస్యల పరిష్కారం కోసం ఐటీడీఏ ముందు నిరవధిక సమ్మె నిర్వహిస్తున్నాం. ప్రభుత్వం మొండికి పోకుండా తమ సమస్యలను సానుకూలంగా పరిష్కరించాలి. లేనట్లయితే ప్రజా ఉద్యమాన్ని నిర్వహిస్తాం. పాఠశాలలోని విద్యార్థుల తల్లిదండ్రులు సీఆర్టీల సమ్మెకు సంఘీభావం తెలపడానికి. సిద్ధంగా ఉన్నారు.

### సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమిస్తాం : పసుపులేటి శ్రీనివాస్ , సీఆర్టీల సంఘం, జిల్లా అధ్యక్షుడు

ప్రభుత్వం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో పని చేస్తున్న సీఆర్టీల సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళనలు కొనసాగిస్తాం. అంతేకాకుండా తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించే వరకు విధులకు వెళ్ళము.

## సిహెచ్పిలో సెమీ క్రిస్మస్ వేడుకలు

*ఇల్లందు, డిసెంబర్ 22, ప్రజాజ్యోతి:*

క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం ఇల్లందు ఏరియాలోని సిహెచ్పిలో ఐఎన్టియుసి సెంట్రల్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎస్కే. మహబూబ్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ ను కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టియుసి ఇల్లందు వైస్ ప్రెసిడెంట్ జె. వెంకటేశ్వర్లు, సిహెచ్పి ఫిట్ సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి, సిహెచ్పి ఎస్ఈ, డివై. జియం క్రిస్టఫర్, ఐఎన్టియుసి సెంట్రల్ కమిటీ కార్యదర్శులు యండి. ఖాజా గౌస్ మోహినుద్దీన్, సెంట్రల్ నాయకుడు తోట వెంకటేశ్వరరావు, ఏరియా బ్రాంచ్ సెక్రటరీ బండారి నాగేశ్వరరావు, నాయకులు బి. వెంకటరావు, లక్ష్మణ్ రావు, దరియా సింగ్, మోసిన్, మనోజ్, శ్రీనివాస్, సమ్మయ్య, కిషోర్, శ్రీకాంత్, పద్మ, శ్వేత తదితరులు పాల్గొన్నారు.



## పెండింగ్ దరఖాస్తుల పై దృష్టి సారించాలి ...

(మొదటి పేజీ తరువాయి... )

స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ ఆమెకు జిల్లాలో పోలింగ్ కేంద్రాలు, ఓటర్ ఐడి కార్డుల జారీ, పోలింగ్ కేంద్రాలలో చేసిన ఏర్పాట్లు తదితర అంశాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఎలక్షన్ కమిషన్ సూచనల మేరకు క్షేత్రస్థాయిలో షెడ్యూల్ ప్రకారం ఎన్నికల విధులు నిర్వహించాలన్నారు, పెండింగ్లో ఉన్న ఫామ్ 6,7,8 లను వెంటనే పరిష్కరించాలని, దివ్యాంగ ఓటర్లను, గుర్తించాలని, షెడ్యూల్ ప్రకారం అన్ని రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించాలని, వారి యొక్క సలహాలు, సూచనలు ఎన్నికల కమిషన్ కు పంపాలన్నారు. నాణ్యమైన ఓటరు ఏపిక్ కార్డులను ప్రింట్ చేసి పంపిణీ చేయాలన్నారు. ఓటర్ అవగాహన పై స్వీప్ ఆక్టివిటీస్, స్టార్ క్యాంపైనర్స్ ద్వారా డిగ్రీ కాలేజెస్, ఇంజనీరింగ్, ఫార్మసీ, మెడికల్ కాలేజ్ అన్ని విద్యాసంస్థలలో కార్యక్రమాలు నిర్వహించి ఓటరు నమోదు ఓటు హక్కు పై అవగాహన చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.. అన్ని పోలింగ్ కేంద్రాలలో దివ్యాంగుల కోసం ర్యాంప్స్ ఏర్పాటు చేయాలని, త్రాగు నీరు, మరుగుదొడ్ల, విద్యుత్ సరఫరా సౌకర్యం, అన్ని మౌలిక వసతులు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కాశయ్య, భద్రాచలం ఆర్డీవో దామోదర్ రావు, తాసిల్దార్లు, ఎలక్షన్ సూపర్డెంట్ రంగ ప్రసాద్, బీసీ సంక్షేమ అధికారి ఇందిరా, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## దుప్పట్లు పంపిణీ చేసిన తుమ్మల అనుచరుడు అడపా నాగేశ్వరరావు



*ములకలపల్లి, డిసెంబర్21, ప్రజాజ్యోతి:*

మండల పరిధిలో ని జగన్నాధపురం, నల్లముడి గ్రామాలలో కాంగ్రెస్ నాయకులు , తుమ్మల అనుచరుడు అడపా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం దుప్పట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఎస్సై కిన్నెర రాజశేఖర్ చేతుల మీదుగా జరిగిన ఈ పంపిణీ కార్యక్రమంలో రెండు గ్రామాలలోని సుమారు 150 మంది వృద్ధులు, నిరుపేదలకు పంపిణి చేశారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ శీతాకాలంలో వృద్ధులు చలితో ఇబ్బందులకు గురికాకుండా దుప్పట్ల పంపిణీ కార్యక్రమం చేపడుతున్న అడపా నాగేశ్వరరావును ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కారం సుదీర్ తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి: ఎస్సై కిన్నెర రాజశేఖర్



*ములకలపల్లి, డిసెంబర్ 21, ప్రజాజ్యోతి:*

ప్రతి ఒక్కరూ సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని ములకలపల్లి ఎస్సై కిన్నెర రాజశేఖర్ అన్నారు. ఆదివారం మండలంలోని నల్లముడి గ్రామంలో సైబర్ నేరాల పై ఆవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సమాజంలో నేడు సైబర్ నేరాలు ఎక్కువయ్యాయని, అత్యాశకు పోయి మోసపోవద్దని అన్నారు. సోషల్ మీడియాలో వ్యక్తి గత సమాచారం పంచుకోవద్దని సూచించారు. అంతర్జాలంలో వచ్చే ప్రకటనలు నమ్మి చాలా మంది నష్టపోతున్నారని, అలాంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. అపరచిత వ్యక్తులు ఫోన్ చేసి ఓటిపి లు అడిగితే వారితో పంచుకోవద్దన్నారు. ఎవరైనా సైబర్ నేరానికి గురి అయితే వెంటనే డయల్ 100, 1930 ఉచిత సహాయ కేంద్రానికి కాల్ చేసి పిర్యాదు చేయాలని సూచించారు. ఆలస్యం చేయకుండా గోల్డెన్ అవర్ లో కాల్ చేస్తే ఫలితం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీతాయిగూడెం మాజీ సర్పంచ్ కారం సుదీర్, కాంగ్రెస్ నాయకులు అడపా నాగేశ్వరరావు, భుజంగరావు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.